కథా నిలయం
శ్రీకాకుళం



# పావులు

ఆవేళ......

పడమటవైపుకి చూస్తే ఎంత ఎఱ్ఱగా భయంకరంగా వున్నదో అచ్చం అలాగే ఉంది ఎంకయదొర ముఖం. కొలిమి లోని నిప్పు కణికల్లా జ్వలిస్తున్నాయి కళ్ళు.

అంత భగభగ లాడిపోతున్న ఎంకయదొర ఆ ఊరి మారాజు. ఆ ఊరోళ్ళంతా అతన్దగ్గర కుక్కల్లాటోళ్ళే! నోరెత్తి పెత్తనం చలాయించేవోడింకా పుట్టలేదు. పుట్టబోడని దొర అంచనా!

దొర మోచేతి నీళ్ళు తాగుతున్నవాళ్ళే అంతా ! దొరకి అంత అహంకారానికీ, అధికారానికీ కారణం–దొర గాడ్రెజ్ బీరువాల్నిండా నోట్లు మూల్గుతున్నాయి. బ్యాంక్ లాకర్లలో బంగారం భద్రంగా వుంది. పసిడిని పండించే పొలాలు. ఇంకా కొబ్బరితోటలు.. వాటిని చూసుకోడానికి నౌకర్లు... చాకర్లు.

అలాంటి ఎంకయదొర ముంగిటే ఏ తీర్పయినా జరగాలి. ఏ మంతిరిగోరు మీటింగ్ ఎట్టినా అక్కడే ఎట్టాల!!

సీమ నుంచి ఏ దర్జాబాబు మకాం పెట్టాలన్నా దొరింటికాడే.

పై వాటిలో ఏది జరిగినా జనం గుమిగూడి పోతారు.

అయితే ఆ రోజు మాత్రం మంతిరిగోరు మీటింగ్ జరుగుతున్నదని జనం రాలేదు?! సీమ దొర దిగాడని విరగబడిపోలేదు.

ఎంకయ్య దొరగారింట్లో పట్టపగలే దొంగతనం జరిగిపోయిందని గొర్రెల్లా ఎగబడ్డారు.

అప్పటికే ఎంకయదొర తన ముద్దుల కూతురికోసం సీమనుంచి తెప్పించిన బంగారు భరిణ పోయిందని తెలిసి రుద్రుడై పోయాడు.

ఎవడు తీసాడో వాడి రక్తం కళ్ళ చూస్తానన్నాడు. దొంగ ఎవడని ఆరా తీశాడు.

దొర దగ్గరే పనిచేస్తున్న పాలేరు రామిగాడు ఈరిగాడు సేతిలో యిరికించుకుపోతుండగా చూశానన్నాడు.

అంతే మరింత చిందులు తొక్కాడు ఎంకయదొర.

రామిగాడు సాక్ష్యమిస్తానన్నాడు.

"వీరిగాడు ఇంటికాడున్నాడు పిల్సుకు రండి" సాంబిగాడిని. రామిగాడిని పంపాడు దొర.

నేరం వీరిగాడి మీదకు పోయినందుకు తోటిపాలేర్లంతా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

వచ్చీరావడంతోనే పెద్దపులిని చూసి బెంబేలెత్తిపోయిన జింకలాగ వణికిపోయాడు, ఎంకయదొర రౌద్రరూపం చూసిన వీరిగాడు.

"ఏరా ఈరిగా! ఏటి? నాలుగు మెతుకుల్తినేసరికి కండకావర మెక్కినాదేట్రా! తిన్న గుండాలన్నేదా! ఎంకయ్యదొర తలుసుకుంటే నీ శవ మేదుంటుందో తెలుసునా! లోగడ ఎంకిగాడి గతేమయినదో గుర్తుసేసుకో" దొర కరుకు పలుకులు వీరిగాడి చెవుల్లో ఖంగుమన్నాయి.

వీరిగాడి కిదంతా అగమ్యగోచరంగా అనిపించింది.

గతంలో ఎంకిగాడికేమయిందో తననెందుకు గుర్తు చేసుకొమ్మంటున్నాడోనని తెగ కలవరపడిపోయాడు వీరిగాడు.

ఐదేళ్ళనాటి మాట.... ఎంకిగాడి చావు గుర్తు తెచ్చుకుంటే వెన్ను జలదరిస్తుంది.

అప్పట్లో ఎలక్షన్స్‌లో ఎంకయదొర పార్టీకి ప్రచారాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అదే సమయంలో ఎగస్పార్టీ నాయకుడు రామిరెడ్డి ఏదో ఆశపెట్టినాడని

అంతవరకూ దొర ప్రక్క తిరిగిన ఎంకిగాడు, రెడ్డి ప్రక్క దూకేసాడు. అది తెలిసి ఎంకయ్యదొర ఎంకిగాడిని అగురుతోటలకాడ నరికించేసాడు. శవం కూడా పికర్లేకుండా చంపావతి ఏట్లో పడేశాడు.

క్రితంలో ఎంకిగాడికి పట్టిన దుర్గతి స్ఫురణకొచ్చి వణుకుపుట్టింది వీరిగాడికి.

"అయ్యా! ఎందుకు పిలిసినారో... తమరెందుకిలాగ మాట్లాడుతున్నారో నా కరదం కావట్లేదు. దయసేసి కూకలెయ్యకుండా సెప్పండి" అని దీనాతిదీనంగా అడిగాడు వీరిగాడు.

'ఒరే! లం.... కొడుకా! మీకు పోగాలాలు ఎక్కువయినాయిరా.... మా మీద పడి మమ్మల్ని పీక్కుతిందామని సూత్తుండార్రా...అసలు మాకు బుద్ధులుండాలి... అలగా నా కొడుకుల్ని మామీద ఎక్కించుకుందుకి...రామిగాడు సెప్పకపోయినట్లయితే... ఈ యేల్టికి కూడా నీ సంగత్తెలిసేది కాదు" అంటూ గంగవెర్రెత్తి పోయాడు ఎంకయదొర.

"సంగతా!" నిర్ఘాంతపోయిన వీరిగాడి మాట తడబడింది.

దొరవాడి వాలకానికి ఉగ్రంగా చూస్తూ "ఒరే! సంగతంటే నీకింకా బోధపడనేదా!... దొంగతనంరా! కేడీనాకొడకా" అన్నాడు.

"యిన్నేల్లూ మీ ఉప్పు తిని బతికి నోల్లం... ఎవుడు మీ యింటికాడ దొంగతనం సేసినాడు.. ఆడ్ని వుప్పుపాతరేస్తాను. మీ రిచ్చిన జీతం డబ్బుల్తో మాకడుపులు నిండాల... అంతేకాని కక్కుర్తిపడి యిండ్ల దొంగతనంసేస్తే మా బతుకులు చితికిపోవా బాబూ! ఎవుడు బాబూ ఆడు.... ఆడ్ని గొడ్డల్తో నిలువునా నరికినా పాపముండదు..." దొర మీద అభిమానం వెల్లువయింది వీరిగాడిలో.

ఈ పదేళ్ళనించీ తను చూస్తున్నాడు. దొర ఇంట్లో ఏనాడూ దొంగతనం జరగలేదు. అసలు ఎవరికింత సాహసం?"

"ఒరే...కరెక్టుగా సెప్పినావ్రా...! దొంగనాయాల... దొంగోడ్ని గొడ్డల్తో నరికినా పాపముండదు కద్రా! అంటే నీకు నువ్వే తీర్పు యిచ్చుకున్నావన్న మాట.

"అంటే!" బిత్తరపోయాడు వీరిగాడు.

"ఆ... నీకంతా ముందు ముందు అరదమవుద్దిరా! యింతకీ ఏనా కొడుక్కి బేడాపరక్కి అమ్మేసినావు. ఆ బంగరుబరినె...సెప్పరా లం...కొడుకా!" చెంప చెళ్ళుమంది.

వీరిగాడి బుగ్గల్లో రక్తం కరడు కట్టింది.

గుడ్లంట నీళ్ళు నిండి... యింక రాలిపోవడానికి సిద్ధమవుతున్నాయి.

"బాబయ్యా! బంగారు బరినా! అదెట్లుంటదో నాకు తెల్వదు. మీ యింట పదేళ్ళయిపాలేరుగున్నాను. ఎప్పుడైనా మీ యింటి నుంచి పిసరంతైన పట్టికెల్దం మీరెరుగుదురా... సెప్పండి... మీకిది దరమం కాదు..." వీరిగాడు ఏడ్వసాగాడు.

"అందుకేర్రా! మిమ్మల్ని అంత నమ్మబట్టే యింత సిచ్చు పెడుతున్నారు. ఆడబిడ్డ ముచ్చటపడ్డదని సీమనించి తెప్పించినాను. బర్నె పోయిందని తెలిస్తే బిడ్డ ఎంత కలవరపడుద్దో! ఒరే! ఈరిగా! సెప్తున్నా! కాళ్ళ క్రింద సెప్పులాంటివోడివి... నిన్ను బతిమిలాడ్డవేటి! అసల్నాబుత్తక్కొ గాని... నీ బూటకాలు నాటకాలు ఈడ కాదు. నీకు నాల్గు దెబ్బల్తగిల్తేగాని సెప్పినట్టు కనిపించటం నేదు..." అని రామిగాడికి సంజ్ఞ చేశాడు. గబ గబ లోనికి పోయి క్షణంలో నిగనిగలాడుతున్న నల్లకొరడా దొరకు అందించాడు.

"అయ్యా! నా మాట ఇనుకోండయ్యా! నానే పాపం ఎరగనయ్యా! ఈ ఈరిగానికి తెల్సింది ఒక్క నిజాయితీయేనయ్యా! దొంగతనం మా యింటావంటానేదయ్యా! దయ సూపవయ్యా!... ఒరే రామిగా... నా న్దొంగతనం సేత్తుండగా నువ్వు జూసినావా! ఎంతన్నాయంరా? నీకేటి అన్నేయం సేసాన్రా! నా కడుపు కొట్టితే నీకేటి నాబంరా! దొరబాబు కెందుకురా కల్ల బొల్లి మాటల్చెప్పినావు" తోటి పాలేరే తనమీద యింతటి ఘోరమైన నిందని మోపినందుకు కసిగా అని తను దొంగతనం చెయ్యలేదని మొత్తుకున్నాడు.

ఎంకయదొర మనసుకెలా దయాదాక్షిణ్యాలన్నవి తెలీదో... ఆ కొరడా కంతకన్నా తెలీదని వేరే చెప్పనక్కరలేదు.

అంతే! కామందు కొరడా ఝళిపించాడు.

కనికరం లేకుండా బాత్తున్నాడు.

ఈలోగానే అక్కడి జనాల్ని యింటిదారి పట్టించాడు రామిగాడు....

"అమ్మో... నాయినో" పుండుమీద కారం జల్లితే కలిగిన బాధకన్నా వేయిరెట్లు నరకయాతన పడుతున్నాడు.

పామునోట్లో కప్పపడే ప్రాణయాతన. పులిపంజా లేడి శరీరంలో దిగబడ్డపుడు ఆ పసికూన పడే ఆవేదన.

"నాన్దొంగను కాను... నాన్దొంగను కాను..." వీరిగాడి కేకలు దిగంతాల వ్యాపిస్తున్నాయి.

కొంతసేపటికి వీరిగాడి అరుపులతో పాటు వాడిలోని జీవికి కదలిక కూడా స్తంభించిపోయింది. "ఈరిగాడు సచ్చిపోనాడు దొరా...." రామిగాడు వాడ్ని పరిశీలనగా చూసి ఎంకడిదొరతో చెప్పాడు.

అయితే ఇంతలో వీరిగాడి పెళ్ళాం సుక్కికీ విషయం ఎలా తెలిసిందో పరుగుపరుగున వచ్చి పెనిమిటి తనువు మీద వాలిపోయింది.

జరిగిన ఘాతుకం చూసి తల్లడిల్లిపోయింది.

అంతే! లేచింది... ఆదిశక్తిలా... భద్రకాళిలా... కళ్ళల్లో చింతనెగళ్ళు వెలిగాయి.

సుక్కికి అడ్డంగా రామిగాడు నిల్చున్నాడు. "ఒరే! దిక్కుమాల్ని నాకొడకా! రామిగా! నా మామదొంగరా! అసలు మీరే దొంగనాయాల్రా! ఎవడికి కావాల్రా మీ బర్నె.... మావేం సేస్కుంటాంరా... మీ కండకావరా లెక్కువయిపోయి... మీ మట్టుకు మీరే ఎక్కడో ఒగ్గీసుకుని... మాలోటోళ్ళమీన తోసేసి గాతుకం సేత్తున్నారు... అసల్నా పెనిమిట్ని సంపడానికి మీకు సేతులెట్టావచ్చినాయిరా! మీరెవుర్రా....మీకు మా మీద అనుమాన మొత్తే... పోలీసోల్ల కప్పజెప్పవలసిందిరా! అంతేగాని మీ కెందుకురా.." ఆ ఊరి అమ్మోరి దేవత తన పండగప్పుడు ఎంత రౌద్రంగా వుంటుందో అట్లా వుంది సుక్కి....

ఆగ్రహావేశాలలో ఆమె రొమ్ములు కడలి కెరటాల్లా ఎగసెగసిపడుతున్నాయి.

అయితే రామిగాడు ఒక్క ఉదుట్న సింహంలా సుక్కిమీద పడి పెడరెక్కలు విరిచి కట్టాడు.

అదాటుగా రామిగాడి దాడికి లొంగిపోక తప్పలేదు ఆమెకి. దాంతో మరింత ఏడుపు హెచ్చించింది.

"ఒరే! రామిగా! ఈరిగాని యిసయం ఊర్లో తెల్సినాదంటే పెమాదం. ఈ సుక్కి ఏడైనా వోగేస్తే పరమ సికాకు. దీన్ని కూడ ఈరిగాడి మాదిరి సేసేసి యిద్దర్ని సెంపావతిలోకి తోసేస్తే అయిపుండదు మరి" రామిగాడితో చెప్పాడు దొర.

"అయ్యా! దొరా! దీన్ని... సంపాలంటే నిమిసం పట్టదు... అయితే సచ్చిపోయే ముందు నేత నవుజులాంటి పెట్టని రుసిసూడకుండా వొదిలిపెట్టడం తగదు" రామిగాడు స్వామిభక్తిని నిరూపించుకున్నాడు.

దొర దర్పంగా మీసాలు దువ్వుకుని సుక్కి ప్రక్క చూసాడు.

లేడికూన ప్రక్క పులి చూపులా వుందది.

"జెనారేయ్! బాగుగ గుర్తు సేసినావ్! పెట్ట మంచిపసందుగుంది. ఏర్పాట్సెయి" అని రామిగాడి భుజం తట్టి తన బంగళా వైపు చూపించాడు ఎంకయ్య దొర.

రామిగాడు సుక్కిని భుజం మీద వేసుకుని బంగళావైపు దారితీసాడు.

సుక్కి అరుపులు మిన్ను ముడుతున్నాయి.

సుక్కి దొర కోరికకు ఒప్పుకోలేదు. గింజుకుంది... గీరేసింది... విడిపించుకుంది... ఎంతచేసినా.. ఎన్ని విధాల ప్రయత్నించినా... సుక్కిబలం చాలలేదు ఎంకయదొర ఏనుగుబలం ముందు.

అందుకే అతని కామాగ్నికి ఆహుతైపోయింది.

మలినమైన మానం గురించి తలుచుకుని కుమిలిపోయి కుమిలిపోయి - చివరికి ఆ వెగటుని భరించలేక ఈ లోకం నుంచే సెలవు తీసుకుంది.

ఎంకయదొర - ఆకలి తీరిపోయినాక రామిగాడు వచ్చి "యింకా సుక్కిని సంపాలనుకున్నాను. ఈడే పని జరిగిపోనాది" అని సుక్కిని చంపవలసిన బాధ్యత తప్పినందుకు సంతోషపడిపోయాడు.

సుక్కి - వీరిగాళ్ళ శరీరాల్ని తీసుకుని చంపావతి నది ప్రవాహపు వడిలో పడేశాడు రామిగాడు.

★ ★ ★

బంగారు భరిణె దొంగతనం గురించి దొరకు తెలిసిన ముందురోజు దొర కొడుకు నవకాంత్ పట్నం నుంచి యింటికి వచ్చాడు. నవకాంత్ మెడిసన్ ఫైనలియర్‌లో ఉన్నాడు. అతనా రోజు తండ్రిని చాలా రోజులై చూడలేదని రాలేదు.... పల్లెటూరిమీద మోజు పుట్టి అంతకన్నా కాదు.

అయితే పట్నంలో నవకాంత్ ఒక అమ్మాయిని ప్రేమించాడు ఆ అమ్మాయి పేరు రజియా... నిజానికి ఆ అందాల భరిణె ప్రేమ ఫలించడం నవకాంత్ అదృష్టం అన్నారు అతని మిత్రులు.

"రజియాను వెంటేసుకుని సినీమాలు షికార్లు జోరేనా, లేక మా కేదయిననా పార్టీ ఉందా..." అని తమ కెలాగైనా మందుపార్టీ సన్-ఎన్-సీలో యిచ్చి తీరాలని పట్టుబట్టారు.

ఆ సమయంలో నవకాంత్ జేబులు ఖాళీగా వెక్కిరించాయి.

"దొరబిడ్డవు... నీకేం గురూ తలుచుకుంటే నువ్వు చెయ్యలేనిది లేదు" అంటూ

తెగ ఉబ్బించేసి నవకాంత్‌ని పల్లెకు పంపించేశారు అతని మిత్ర బృందం.

అందుకే ఇంటికి వచ్చాడు నవకాంత్. అయితే ఆ సమయంలో తండ్రి ఎవరిపైనో అగ్గగ్గలాడ్తున్నాడు.

చిన్ననాటి నుంచీ తండ్రంటే అమిత భయం కావటాన తను డబ్బు అడిగినా యివ్వడని తెలిసిపోయింది. అయితే ఫ్రెండ్స్ పార్టీకోసం వెయిట్ చేస్తూంటారని కూడా అనుకున్నాడు. అయితే ఎలా? ఎలా?

అంతే... ఎదురుగా డ్రస్సింగ్ టేబుల్ మీద చెల్లెలి కోసం సీమ నుంచి తెప్పించిన బంగారు భరిణె కనిపించింది. కళ్ళు జిగ్గు మన్నాయి.

ఆ సమయంలో ఎవరూ లేరు. అంతే తీసి జేబులో పెట్టుకున్నాడు. అయితే ఎవరో కిటికీ గుండా గమనించినట్టయి బయటకు వెళ్ళి చూశాడు.

పాలేరు రామిగాడు. "ఒరే రామిగా" సింహం గర్జించినట్లు వుంది ఆ పిలుపు.

తొట్రుపడ్డాడు రామిగాడు.

"ఏరా యిలారా! ఈ భరిణె నేను తీసిన సంగతి మూడో కంటికి తెలీకూడదనుకున్నాను. కానీ నీ కంట పడింది. ఒకందుకు యిదీ మంచిదే అయింది. దీన్ని నీ ఇంట్లో దాచి నే నడిగినపుడు యివ్వు. ఈలోగా చెల్లి భరిణె పోయిందని గోలెడుతుంది. కానీ నోరు మెదపకు. మన వీరిగాడు లేడూ వాడి మీదికి నెట్టెయ్! తర్వాత కథంతా నేన్నడిపిస్తాను" అని భరిణె ఇచ్చాడు నవకాంత్.

దాన్ని అందుకున్నప్పుడు రామిగాడి చేతులు గడగడ వణికాయి. కాని దొరబిడ్డ ఆజ్ఞ తిరస్కరించే దమ్ములేదు వాడికి, ఒకవేళ తృణీకరిస్తే తిరిగి తన పైకే నేరం రుద్దొచ్చుననుకున్నాడు.

ఆ భరిణెని భద్రంగా తనింట్లోనే దాచాడు.

మర్నాడుదయం దొర కూతురు భరిణె పోయిందని గోలపెట్టడంతోనే ఆ నేరం వీరిగాడిపైకి నెట్టి వాడి చావుకి, ఓ ఆడబిడ్డా చెరపబడ్డానికి కారణం అయినాడు రామిగాడు.

దాని కంతటికీ మూలకారణం తనే అయినా తండ్రికి తెలీదని చంకలు గుద్దుకోవటమే కాక వీరిగాడి, సుక్కిల చావు కేకళ్ళకి మృగంలా వినోదించాడు నవకాంత్.

దొర అకృత్యంలో భాగంగా నిర్భాగ్యులు చితికిపోవటంలో విశేషం లేదు. కాబట్టి ఎప్పటిలాగే కేసు గీసు లేకుండా సమసిపోయింది.

తర్వాత నవకాంత్ తన మిత్రులు పార్టీ విషయం మెదడులో పడి కుమ్మరి

పురుగులా తొలవసాగింది.

రామిగాడిని పిలిచాడు.

"ఒరే రామిగా! నేనిచ్చిన భరణి తీసుకురా, నే పట్నం వెళ్ళిపోవాలి ఈ విషయం ఎవరికయినా తెలిసిందో నీ పీక నులిమేస్తాను" అని హుంకరించాడు నవకాంత్.

"అదేటి బాబూ అలాగంటారు. నా మీద నమ్మకం నేదా! ఎవుడికీ అనుమానం రాకుండా ఈరిగాడి మీదకి తోసేసాను గందా! యిపుడే ఒట్టుకొత్తాను" అని యింటికి చరచర వెళ్ళిపోయాడు రామిగాడు.

రామిగాడు అలా వెళ్ళాడో లేదో, నవకాంత్ దగ్గరికి పరుగెత్తుకుని గబ గబ వచ్చేసింది అతని చెల్లెలు శ్రీతేజ. "అన్నయ్యా నేనంతా విన్నాను ఈ దొంగతనంలో నీకూ రామిగాడికీ భాగం వుంది. కానీ వీరిగాడి మీదకి నేరం పోయింది. అన్యాయంగా రెండు జీవాలు చెయ్యని నేరానికి బలైపోయాయి... చెప్పు.. నువ్వు చేసిందాంతో వీరిగాడు బలైపోవడంతో నాన్న వూరుకున్నా రనుకున్నావా! అసలే నాన్న మూడో కన్ను తెరిచిన శివుడిలా వున్నాడు. ఈ విషయం ఆరా తీసేవరకూ అన్నం ముట్టేలా లేరు. కానీ ఏం ఘోరం జరుగుతుందో నే వూహించలేకపోతున్నాను. చెప్పు ఏమిటి? యింతకీ ఎవరు చేసారీ నేరం? ఈ సాయంత్రంలోగా నాన్న ముందు దోషిని నిలబెట్టకపోతే ఆయనేం చేస్తారో ఆయనకే తెలీదు" అని కోపంతో, ఆవేదనగా చెప్పింది శ్రీతేజ.

నవకాంత్‌కి ముచ్చెమటలు పోసాయి. ఏదో తమాషాకోసం రామిగాడి ద్వారా వీరిగాడిపై నేరం తోయించాడు. కానీ యిపుడు తండ్రి ఉద్రిక్త పవనాలు ఎవరిపైకి మళ్ళుతాయో అనూహ్యం. ఆయనకి అయినవాళ్ళయినా ఇతరులయినా ఒకటే! ఆయన కర్కశానికి బలైపోవలసిందే! ఋజువులు, సాక్ష్యాల కోసం త్రవ్వితే రామిగాడి ద్వారా నిజం బయటపడ్తుంది.

అలా జరిగితే తను తండ్రి కొరడాకి ఎరౌతాడు.

ఇలా ఆలోచించి ఆలోచించి చెల్లెలికి అసలు విషయం అంతా చెప్పేసి ఈ ఊబిలోంచి బయటపడ్డానికి సలహా యిమ్మని కాళ్ళావేళ్ళాపడ్డాడు.

ఎంతయినా తన తోడబుట్టిన వాడి పట్ల హృదయం ద్రవించడం సహజాతి సహజం.

అందుకే శ్రీతేజ తన సోదరుడికో అద్భుతమైన సలహా యిచ్చేసింది.

ఆ సలహాకి నవకాంత్ ముఖం తెగ వెలిగిపోయింది. వెంటనే తండ్రి దగ్గరికి

ఎక్కడలేని ధైర్యంతో వెళ్ళాడు.

మెల్లగా ప్రారంభిస్తూ – "నాన్నా మీరు అనవసరంగా వీరిగాడిమీద అనుమాన పడ్డారు. రామిగాడికీ వీరిగాడికీ చాలాకాలంగా వైరంవుంది. ఆ కారణంగా వాడు తను దొంగతనం చేసి వీరిగాడిపై తోసాడని నా నమ్మకం. వాడి ముఖంలో భయం... కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది నాకు. గడియ గడియకీ ఉలిక్కిపడుతున్నాడు. కావలిస్తే వెంటనే వాడిల్లు సోదా చేయించండి" అన్నాడు నిర్ధారణగా.

ఎంకయదొర భ్రుకుటి ముడిపడింది. ఎంతయినా తన రక్తం పంచుకుపుట్టిన వాడి మాటలు ఎంతో విశ్వాసంగా అనిపించాయి.

వెంటనే రామిగాడి యింటిపై దొర మనుషులు దాడిచేశారు.

రామిగాడు బొడ్డున దోపుకుని భరిణె తెస్తుండటం కళ్ళారా గాంచిన దొర మనుషులు వాడి పెడరెక్కలు విరిచికట్టి లాక్కుని వచ్చారు.

దొర చింతనిప్పులా చిటపటలాడాడు. "దొంగతనం సెయ్యడమేకాక ఈరిగాడిపైకి నేరం తోస్తావా!" అన్నాడు కర్కశంగా...కళ్ళల్లో నిప్పులు కురిశాయి.

"నేదు బాబూ! నేను ఈరిగాడిమీదికి నెట్టలేదు. మీ బాబు నా దగ్గర బర్నె దాచాడు. యియ్యాల పట్నం ఎల్లిపోతానని బర్నె యిమ్మన్నారు. తెత్తూంటే నాన్దొంగనని ఈడుసుకొచ్చినారు. నేయం, దరమం ఉండాల" అని గోలుగోలున ఏడ్చాడు.

"బర్నె ఈరిగాడి మీదికి తోసింది గాక నా కొడుకు పయికే తోస్తావురా! నీకెన్ని గుండెల్రా! ఎదవనాకొడకా" అని రుద్రుడిలా తాండవం చేస్తూ – తన అహంకారాన్ని మరోసారి ఋజువు పరిచాడు ఎంకయదొర.

అమాయకులెప్పుడూ అహంకారులకి బలైపోతారన్నది సర్వ సాధారణం. కాబట్టి రామిగాడు కూడా బలయిపోయాడని వేరే చెప్పనక్కరలేదు.

ప్రభువు నేరం చేసినట్లు తెలిసినా దాన్ని కప్పిపుచ్చడానికి ప్రభువుపై భక్తి కొలదీ తన తోటిపాలేరయినా దొర కర్కోటకానికి బలిచేసాడు.

కానీ కథ యిలా అడ్డం తిరుగుతుందని, తను కూడా దొరబిడ్డ ఆడిన చదరంగంలో పావు అయిపోతానని రామిగాడికి తెలీదు.

అసలు రామిగాడికే కాదు. దొర మోచేతి నీళ్ళు త్రాగుతూ బ్రతికే ఏ అభాగ్యుడికీ తెలీదు... బలైనదాకా తను 'పావు' అయినట్లు.

(యువ మాసపత్రిక – ఫిబ్రవరి 1988)